సాక్షి
పార్వతీపురం మన్యం

శనివారం । 25 । నవంబర్ । 2023



సామాన్యులకు రాజ్యాధికారం
సామాన్యులకు రాజ్యాధికారం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని డిప్యూటీ సీఎం రాజన్నదొర, ఎమ్మెల్యే కళావతి ప్రశంసించారు. -10లో



రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తోండ్రంగి విద్యార్థులు
గరివిడి మండలం తోండ్రంగి పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. -10లో



మహిళలపై దాడులకు పాల్పడితే కఠిన శిక్షలు
మహిళలపై దాడులకు పాల్పడితే శిక్ష తప్పదని ఎస్పీ ఎం.దీపిక హెచ్చరించారు. -10లో





పాలకొండలో నిర్వహించిన సామాజిక సాధికార సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం (ఇన్‌సెట్లో) ఎమ్మెల్యే కళావతి పాలనాతీరును ప్రశంసిస్తూ సభలో ప్రసంగిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- పాలకొండలో జరిగిన సామాజిక సాధికార యాత్రకు పోటెత్తిన జనం
- కొండకోనల్లో మార్మోగిన జగన్ననినాదం
- యాత్రకు తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు
- వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో నూతనోత్తేజం
- గిరిజనులకు మేలు చేసినది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే: రాజన్నదొర
- సాధికారత జెండాను ఎగురవేయాల్సిన బాధ్యత మనదే: స్పీకర్ తమ్మినేని
- సామాజిక విప్లవాన్ని సృష్టించిన జగనన్న: మంత్రి మేరుగ నాగార్జున
- విశాఖ నుంచే పాలన: మంత్రి సీదిరి

మన్యం సిగలో ▸ సామాజిక వికాసం



బస్సు యాత్రపై పూలవర్షం

పాలకొండ/పాలకొండ రూరల్/వీరఘట్టం:

మన్యం సిగలో సామాజిక చైతన్యం వికసించింది. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వెనుకబడిన వర్గాలకు చేసిన మేలును వివరించేందుకు పాలకొండలో శుక్రవారం చేపట్టిన సామాజిక సాధికార యాత్రలో పాల్గొనేందుకు కొండకోనల నుంచి జనం తండోపతండాలుగా తరలివచ్చారు. నిండు మనసుతో మంత్రుల బృందానికి స్వాగతం పలికారు. గిరిజన నృత్య ప్రదర్శనలతో అలరించారు. గిరిజన ఇంట సంతోషం నింపిన జగనన్న పాలనకు జై కొట్టారు. ముఖ్యమంత్రి సాగిస్తున్న సంక్షేమ, అభివృద్ధి పాలనను పాలకులు వివరిస్తుంటే చప్పట్లతో స్వాగతించారు. మా మద్దతు జగనన్నకే అంటూ కేరింతలు కొట్టారు. పాలకొండ మండలం చినమంగళాపురంలో ముందుగా విలేకరుల సమావేశం అనంతరం అక్కడ నూతనంగా నిర్మించిన రైతుభరోసా కేంద్రం, సచివాలయం భవనాలను డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, ఎమ్మెల్యేలు విశ్వాసరాయి కళావతి, అలజంగి జోగారావు, కంబాల జోగులతో కలిసి వైఎస్సార్‌సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి ప్రారంభించారు. తర్వాత వందలాది మంది కార్యకర్తలు బైక్ ర్యాలీతో ముందు సాగగా, సాయంత్రం 4 గంటలకు బస్సుయాత్ర పాలకొండకు చేరుకుంది. దారి పొడవునా ప్రజలు పాలకుల మీద పూలవర్షం కురిపించారు. మంచిచేసిన వారికే మద్దతిస్తామంటూ తమ అభిమానాన్ని చాటారు.

ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అధ్యక్షతన పాలకొండ ఆర్‌సీఎం చర్చి వద్ద జరిగిన బహిరంగ సభలో స్పీకర్ తమ్మినేని సీతారాంతోపాటు మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు సమకూర్చిన సామాజిక సాధికారతను వెల్లడించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీ పెనుమత్స సూర్యనారాయణరాజు, రాజాం, కురుపాం, పార్వతీపురం ఎమ్మెల్యేలు కంబాల జోగులు, పుష్పశ్రీవాణి, అలజంగి జోగారావు, పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు గొండు కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గిరిజనుల్లో ఆర్థికాభ్యున్నతి



గత ప్రభుత్వాల అసమర్థపాలన వల్ల ఏ వర్గానికీ న్యాయం జరగలేదు. వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఆదివాసీల అభ్యున్నతి కోసం విద్య, వైద్య, వ్యవసాయ రంగాల్లో అనేక సంస్కరణలు తీసుకొచ్చారు. నాడు-నేడు నిధులతో పాఠశాలను సుందరంగా తీర్చిదిద్దారు. ఆంగ్ల విద్యను అందుబాటులోకి తెచ్చారు. ఆదివాసీలకు హక్కులు కల్పించారు. పోడు, చిరుధాన్యాల సాగును ప్రోత్సహిస్తున్నారు. వలంటీరు, సచివాలయ వ్యవస్థలతో గిరిజన యువతకు ఉపాధి దొరికింది. వివిధ సంక్షేమ పథకాల కింద నియోజకవర్గంలోని 1.25 లక్షల మందికి రూ.1010 కోట్ల ఆర్థిక ప్రయోజనం కల్పించారు. 750 గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి మీకు ఇంకేమి కావాలని అడిగేంత ధైర్యాన్ని ఇచ్చారు. ప్రజల అభ్యున్నతికి నిరంతరం కష్టిస్తున్న జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు కలిసికట్టుగా పనిచేద్దాం.

– విశ్వాసరాయి కళావతి, పాలకొండ ఎమ్మెల్యే

గిరిజనులకు 'పట్టా'భిషేకం



ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనిషి. ఆయన పెద్దమనసుతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్ర వర్ణాల్లోని బడుగులకు రాజ్యాధికారం కల్పించారు. సంక్షేమ ఫలాలు అందించారు. గిరిజన ప్రాంతం రైతులకు నాలుగున్నరేళ్లలో 3 లక్షల ఎకరాలకు పట్టాలు ఇచ్చారు. గిరిజనులకు ఆర్థిక ఫలాలు అందించడం, ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడంలో చంద్రబాబుకు.. జగన్‌మోహన్‌రెడ్డి నక్కకు నాకలోకానికి ఉన్నంత తేడా. డ్వాక్రా రుణాల మాఫీ పేరిట అక్కచెల్లెమ్మలను, నిరుద్యోగ భృతి పేరిట నిరుద్యోగులను మోసం చేసిన చంద్రబాబు మరోసారి మాయమాటలు చెప్పేందుకు సిద్ధమవుతున్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ నమ్మకండి. మీకు మేలు చేసినది ఎవరో గుర్తించండి. సామాజిక సాధికరత తెచ్చినది ఎవరో తెలుసుకోండి. అక్కచెల్లెమ్మలంతా కలిసి రండి.. మరో సారి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందాం. కళావతిని గెలిపిద్దాం.

– పీడిక రాజన్నదొర, డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి

అభివృద్ధే అజెండా..



వెనుకబడిన ప్రాంతాలైన గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయడమే ధ్యేయంగా వైఎస్సార్‌సీపీ పాలన సాగుతోంది. ప్రతి ఇంటిలోనూ అర్హులైన వారందరికీ సంక్షేమ లబ్ధిని తమ ప్రభుత్వం చేకూరుస్తోంది. అందరికీ మేలు జరిగేలా పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపిద్దాం.

– గొడ్డేటి మాధవి, అరకు ఎంపీ

కళావతమ్మకు హ్యాట్రిక్ విజయాన్ని అందిద్దాం



రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మనసులో ప్రత్యేక స్థానం సంపాదించుకున్న ఎమ్మెల్యే కళావతమ్మకు రానున్న ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయాన్ని అందించి సి.ఎం జగన్‌కు కానుకగా ఇద్దాం. నాలుగు మండలాల్లో ఉన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఒకే కుటుంబంలా ఉన్నాం. ఇదే స్ఫూర్తితో ఎన్నికలకు సిద్ధమవుదాం.

–పాలవలస విక్రాంత్, ఎమ్మెల్సీ

బడుగులకు రాజ్యాధికారం



బడుగులకు రాజ్యాధికారం కల్పించిన ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిదే. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందజేస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల ఆర్థికోన్నతికి కృషిచేస్తున్నారు. చంద్రబాబుకు హామీలు ఇవ్వడం తప్ప అమలుచేసే ధైర్యం లేదు. మోసకారి. యువతకు ఉద్యోగాల కల్పన, ఇళ్ల మంజూరు, భూమి పంపిణీ చేస్తూ అణగారిన వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎంను చేసుకుందాం. అభివృద్ధికి బాటలు వేద్దాం

– మేరుగ నాగార్జున, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి

జగనే కావాలి.. జగనే రావాలి



చంద్రబాబుకు ఆంధ్రప్రదేశ్ లో అడ్రస్, ఆధార్‌కార్డు కూడా లేదు. హైదరాబాద్‌లో ఆయన ఉన్నందున ఆయనకు వినపడేలా జగన్ రావాలి .. జగనే కావాలి అంటూ నినాదాలు చేద్దాం. తమది బీసీల పార్టీ అని చెపుకు నే చంద్రబాబునాయుడు... బీసీ వర్గానికి చెందిన స్పీకర్ తమ్మినేని సీతారాంను పోడియం వద్దకు కూడా వెళ్లకుండా అడ్డుపడ్డారు. బీసీలను అవమాన పరిచిన చంద్రబాబుకు తగిన బుద్ధిచెప్పాలి. జన్మభూమి కమిటీలతో ప్రజలపై బాబు స్వారీ చేయిస్తే... జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజల వద్దకే సంక్షేమ పాలన తీసుకువచ్చారు. డిసెంబర్ మొదటి వారంలో సీఎం జగన్ విశాఖ నుంచి పాలన సాగించనున్నారు. అప్పటి నుంచి విశాఖ పరిపాలనా రాజధాని కాబోతుంది.

– సీదిరి అప్పలరాజు, పశుసంవర్థక, మత్స్య శాఖ మంత్రి

బీసీల చేతిలో సాధికార జెండా



రాష్ట్రంలో జరుగుతున్న సామాజిక సాధికార యాత్రపై దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. అణగారిన వర్గాలను జగన్ గుర్తించి, గౌరవం ఇవ్వడం చూసి అంతా ఆశ్చర్యపోతున్నారు. 139 వెనుకబడిన కులాలను గుర్తించి 56 కార్పొరేషన్లు ఏర్పాటుచేసి నిధులు, విధులు ఇచ్చి ఆత్మాభిమానాన్ని జగన్ పెంచారు. సాధికారత అనేది పూర్తికాలేదు. జగన్ ఇప్పుడిప్పుడే ఆరంభం చేసి దీనిని మహా విప్లవమై విస్తరింపజేస్తున్నారు. సాధికారిత జెండాను వెనుకబడిన వర్గాలకు జగన్ ఇచ్చారు.. దీనిని ఎగురవేయాల్సిన బాధ్యత మనపై ఉంది.

–తమ్మినేని సీతారాం, స్పీకర్



న్యూస్‌రీల్

నేటి నుంచి రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలు

పార్వతీపురం టౌన్: సీతానగరం మండలం జోగింపేటలో 67వ రాష్ట్ర స్థాయి ఆర్చరీ పోటీలను ఈ నెల 25 నుంచి 27వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు జిల్లా విద్యాశాఖాధికారి, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ ఎన్.ప్రేమ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జోగింపేటలోని డా.బీ.ఆర్.అంబేడ్కర్ గురుకుల మైదానంలో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు. అండర్-14, 17, 19 విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఆర్చరీ పోటీలకు ఆహ్వానం



డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొరకు ఆహ్వానం పలుకుతున్న డీఈఓ ప్రేమ్‌కుమార్

సాలూరు: సీతానగరం మండలం జోగింపేట డా.బి.ఆర్.అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహించనున్న ఆర్చరీ పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరుకావాలని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొరకు డీఈఓ ప్రేమ్‌కుమార్ ఆహ్వానం పలికారు. ఉపముఖ్యమంత్రిను పట్టణంలోని ఆయన గృహంలో శుక్రవారం కలిశారు. ఆయన వెంట ఎంఈఓ రాజ్‌కుమార్, ఉపాధ్యాయుడు రంభ రజనీకాంత్ ఉన్నారు.

జాతీయస్థాయి పోటీలకు గురుకుల విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీరాములు, పీడీ

సాలూరు: మండలంలోని పీఎస్ బొడ్డవలస అంబేడ్కర్ గురుకులానికి చెందిన ముగ్గురు విద్యార్థులు జాతీయస్థాయి ఆత్యాపాత్యా పోటీల్లో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీరాములు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, ఈ నెల 26 నుంచి 29 వరకు తమిళనాడు రాష్ట్రంలోని కాట్పాడ్‌లో జాతీయస్థాయి పోటీలు జరగనున్నాయని తెలి పారు. ఈ పోటీలకు కళాశాలకు చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థులు వాసు, జశ్వంత్, భవానీ ప్రసాద్ ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా వారిని పీడీ విద్యాసాగర్, పీఈటీ నాయుడు తదితరులు అభినందించి జాతీయస్థాయి పోటీల్లో రాణించాల ని ఆకాంక్షించారు.

• గర్భగుడి నుంచి.. గుండె గుడికి





మబ్బులు పట్టిన సంధ్య వేళ సూరీడు మెరిసిపోయాడు. జగమంతా చీకటి అలముకున్న సమయాన ఇంద్ర పుష్కరిణిలో దేదీప్యమానంగా ప్రకాశించాడు. గర్భగుడి వదిలి భక్తుల గుండె గుడిలో ప్రత్యక్షమయ్యాడు. వేల మంది తన్మయులై చూస్తుండగా సతుల సమేతంగా కోవెల కొలనులో విహరించాడు. క్షీరాబ్ధి ద్వాదశి శుక్రవారం నాడు శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి సూర్యధామం ఆదిత్యుని నామస్మరణతో ప్రతిధ్వనించింది. హంసనావపై స్వామి పన్నెండు మార్లు పుష్కరిణిలో తిరుగాడాడు. రోజంతా స్వర్ణాలంకరణలో ధగధగా ప్రకాశించాడు.

సామాన్యులకు రాజ్యాధికారం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

- అర్హతే కొలమానంగా సంక్షేమం అమలు
- డిప్యూటీ సీఎం రాజన్నదొర

పాలకొండ/వీరఘట్టం: సామాన్యులకు కూడా రాజ్యాధికారం కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని డిప్యూటీ సీఎం, గిరిజన శాఖ మంత్రి డిప్యూటీ రాజన్నదొర ప్రశంసించారు. సామాజిక సాధికార బస్సు యాత్రలో భాగంగా పాలకొండ మండలంలోని చిన మంగళాపురం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హతే కొలమానంగా ఎస్సీ,ఎస్టీ, ఎస్సీ, మైనార్టీ,అగ్రవర్ణ పేదలకు సంక్షేమ పథకాలను తమ ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. నాలుగున్నరేళ్లగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు తెలియజేసేందుకే ఈ సామాజిక సాధికార యాత్ర నిర్వహిస్తున్నామని చెప్పారు. తాము చేపట్టిన ఈ యాత్రకు జనం తండోపతండాలుగా వస్తుంటే చూసి తట్టుకోలేక ప్రతిపక్ష మీడియా అక్కసుతో తప్పుడు రాతలు రాస్తోందని మండిపడ్డారు. మా ప్రభుత్వం చేసి చేసిన సంక్షేమాన్ని అభివృద్ధిని ప్రజలకు వివరిస్తున్నాం. ప్రజలను ఓటు అడిగే హక్కు వైఎస్సార్‌సీపీకి మాత్రమే ఉందన్నారు.అంతకు ముందు ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పార్వతీపురం మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్‌రాజు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామాజిక సాధికార యాత్రకు పాలకొండ నియోజకవర్గ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారని సంతోషం వ్యక్తం చేశారు.

జగన్ గుండెలో పాలకొండ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పాలకొండ నియోజకవర్గం అంటే ఓ ప్రత్యేక అభిమానం ఉందని స్థానిక ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. అందుచే గడిచిన నాలుగున్నరేళ్లలో పాలకొండ నియోజకరవర్గం అభివృద్ధికి ప్రత్యక్షంగా రూ.1000 కోట్లు, పరోక్షంగా రూ.210 కోట్లు కేటాయించారన్నారు. పారదర్శకంగా పాలన చేస్తూ నేరుగా లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. అందుకే ఆంధ్రప్రదేశ్‌కు జగనే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వల్లనే నేడు గిరిజన సాధికారత సాధించామని చెప్పారు.

సీఎం మనసులో ఎమ్మెల్యేకు ప్రత్యేక స్థానం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మనసులో ఎమ్మెల్యే కళావతికి ప్రత్యేక స్థానం ఉందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ అన్నారు. 2018లో ప్రజాసంకల్పయాత్రలో భాగంగా ప్రతిపక్ష హోదాలో పాలకొండకు వచ్చి ఇక్కడ నిర్వహించిన బహిరంగ సభలో జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన మాటలు ఇంకా తనకు గుర్తున్నాయని, కళావతి తన అక్క అని జగన్ మోహన్ రెడ్డి సభాముఖంగా చెప్పి ఆమెకు ఎంతో ప్రాధాన్యం ఇచ్చారన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రీజనల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణరాజు, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు, కురుపాం ఎమ్మెల్యే పుష్పశ్రీవాణి, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అందవరపు సూరిబాబు, పాలకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పరిశీలకుడు గొండు కృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే శోభా హైమావతితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం విజయవంతం

- జేసీ నిర్వహించిన కార్యక్రమానికి 133 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తున్న జేసీ గోవిందరావు, ఆర్‌డీఓ హేమలత

సాలూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పార్వతీపురం మన్యం జిల్లా జేసీ గోవిందరావు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమం విజయవంతమైంది. కార్యక్రమంలో భాగంగా జేసీ గోవిందరావు ప్రజల నుంచి 133 అర్జీలు స్వీకరించారు. వాటిని జేసీ గోవిందరావు, ఆర్‌డీఓ హేమలతలు పరిశీలించి, అర్జీలు పరిష్కరించాలని సంబంధిత జిల్లాస్థాయి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, డీపీఓ బి.సత్యనారాయణ, డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్, డీఏఓ రాబర్ట్‌పాల్, డీఎంహెచ్‌ఓ డా.జగన్నాథరావు, డీఈఓ ప్రేమ్‌కుమార్, సీపీఓ వీర్రాజు, సోషల్ వెల్ఫేర్ డీడీ గయాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ రేషన్ అందిస్తాం

రేషన్ పంపిణీకి సంబంధించి క్షేత్రస్థాయిలో సమస్యలను అధిగమించి, ప్రతి ఒక్క లబ్ధిదారుకు రేషన్ అందేలా చర్యలు తీసుకుంటున్నామని జేసీ గోవిందరావు స్పష్టం చేశారు. జగనన్న చెబుదాం కార్యక్రమం అనంతరం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ, రేషన్ సమస్యలు పరిష్కరించాలని ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, పౌరసరఫరాల శాఖ కమిషనర్‌ల ఆదేశాల మేరకు, వచ్చే నెల 1వ తేదీనుంచే అన్ని ఎండీఎం వాహనాల ద్వారా కచ్చితంగా రేషన్ పంపిణీ జరగనున్నట్లు తెలిపారు.

జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు బాడంగి విద్యార్థి



జాతీయస్థాయికి ఎంపికైన విద్యార్థితో హెచ్‌ఎం, పీడీ, ప్రత్యేక ఉపాధ్యాయుడు

బాడంగి: స్థానిక హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న మామిడిశ్రీను జాతీయస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీడీ, కోచ్ జి.బంగారు నాయుడు చెప్పారు. ఈ మేరకు స్థానిక హైస్కూల్‌లో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 19, 20,21వతేదీలలోనంద్యాల జిల్లాలోని మిడుతూరులో జరిగిన అండర్ 14 స్కూల్‌గేమ్స్‌లో శ్రీను ప్రతిభ చూపి జాతీయస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. వచ్చేఏడాది ఫిబ్రవరిలో ఛత్తీస్‌గఢ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీలకు మనరాష్ట్రం నుంచి శ్రీనుతోపాటు కేజీబీవీ నుంచి ఎల్.దీప్తి, ఉల్లిభద్ర పాఠశాల నుంచి చాందిని, భాగ్యలక్ష్మి, హేమలత, చరణ్, మోహన్‌కృష్ణ, శేఖర్ హాజరుకానున్నారని చెప్పారు. ఈ సందర్భంగా శ్రీనును హెచ్‌ఎం డి.సత్యనారాయణ, ప్రత్యేక ఉపాధ్యాయుడు కొల్లిఈశ్వర రావు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

కోనూరు విద్యార్థుల సత్తా

- రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు కైవసం



రాష్ట్రస్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ

చీపురుపల్లిరూరల్(గరివిడి): గరివిడి మండలంలోని కోనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో జరిగిన కబడ్డీ, ఫుట్‌బాల్ క్రీడాంశాల్లో సత్తాచాటి పతకాలు సాధించారు. ఈనెల 4,5,6 తేదీల్లో కర్నూలు జిల్లాలో అండర్-17 విభాగంలో జరిగిన ఫుట్‌బాల్ పోటీల్లో పి.తేజ ద్వితీయస్థానం సాధించి సిల్వర్ మెడల్ సొంతం చేసుకుంది. అలాగే ఈనెల 18,19,20 తేదీల్లో కడప జిల్లాలో జరిగిన కబడ్డీ పోటీల్లో అండర్-14 విభాగంలో సీహెచ్.జశ్వంత్,ఎ.యమున తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్స్ గెలుచుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన విద్యార్థులను, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్న మరికొంత మంది విద్యార్థులను హెచ్‌ఎం.టీవీజీకే మూర్తి, పి.విజయలక్ష్మి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు తోండ్రంగి విద్యార్థులు



చీపురుపల్లి రూరల్: రాష్ట్రస్థాయి ఖోఖోపోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీ



గుర్ల: ఖోఖో పోటీలకు ఎంపికైన విద్యార్థులతో గరికవలస హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు



గుర్ల: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో చింతలపేట హెచ్‌ఎం గౌరిదేవి, పీఈటీ లక్ష్మణ్

చీపురుపల్లి రూరల్(గరివిడి): గరివిడి మండలంలోని తోండ్రంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.దివ్యశ్రీ, ఎన్.జోషిత, పి.థెరిసా, ఎస్.హారిక, ఒమ్మి సౌమ్య, సీహెచ్.దివాకర్‌లు రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. ఇటీవల విజయనగరం జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఈ విద్యార్థులు సత్తాచాటారు. ఈనెల 27,28,29 తేదీల్లో గుంటూరు జిల్లా నరసారావుపేటలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున ఈ విద్యార్థులు ప్రాతినిధ్యం వహించనుండడంతో హెచ్‌ఎం.ఏవీ. రమణరాజు, పీడీ సత్యనారాయణ, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది వారిని అభినందించారు.

గరికవలస విద్యార్థులు కూడా..

గుర్ల: రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు గుర్ల మండలంలోని గరికవలస హైస్కూల్ విద్యార్థులు మండల ధనలక్ష్మి, ఆవాల మణికంఠ ఎంపికయ్యారని పీఈటీ మల్లికార్జున రావు శుక్రవారం తెలిపారు. గుంటూరు జిల్లా నరసరావు పేటలో జరగబోయే ఖోఖో వారు పాల్గొంటారని చెప్పారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు అభినందించారు.

త్రోబాల్ పోటీలకు చింతలపేట విద్యార్థులు..

గుర్ల: రాష్ట్రస్థాయి త్రోబాల్ పోటీలకు గుర్ల మండలంలోని చింతలపేట హైస్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని పీఈటీ కె.లక్ష్మణ్ శుక్రవారం తెలిపారు. నెల్లిమర్లలో జరిగిన జిల్లాస్థాయి త్రోబాల్ పోటీలలో అండర్ -14 విభాగంలో మజ్జి యమున, వెంపడాపు భార్గవ్ అండర్-17 విభాగంలో మజ్జి పూజిత, కరిమజ్జి మురళి ఉత్తమ ప్రదర్శన కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని చెప్పారు. వారు డిసెంబర్ 12న నంద్యాలలో జరగనున్న పోటీలలో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను హెచ్‌ఎం గౌరిదేవి అభినందించారు.

27న నైరెడ్‌లో స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూ

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ నైరెడ్‌లో ఈ నెల 27న స్వయం ఉపాధి శిక్షణకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నామని డైరెక్టర్ కె.శశిధర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ స్త్రీ, పురుషులు ఈ శిక్షణకు అర్హులన్నారు. పురుషులకు సీసీటీవీ రిపేరింగ్ అండ్ ఇన్‌స్టాలేషన్ (13 రోజులు), ఎలక్ట్రికల్ హౌస్‌వైరింగ్ అండ్ ఫ్యాన్ రివైండింగ్ (30 రోజులు), కార్ డ్రైవింగ్ (ఎల్‌ఎల్‌ఆర్ కలిగి ఉండాలి)లో 30 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. స్త్రీలకు లేడీస్ టైలరింగ్, మగ్గం వర్క్, కంప్యూటర్ బేసిక్స్ అండ్ టాలీలో 30 రోజుల శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. ఇంటర్వ్యూకు హాజరయ్యేవారు పదో తరగతి మార్కుల లిస్టు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డులతో రావాలని సూచించారు. శిక్షణ డిసెంబర్ 1 నుంచి ప్రారంభం కానుందని తెలిపారు. శిక్షణ కాలంలో భోజన, వసతి సదుపాయం కల్పించనున్నామని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 9014716255, 9491741129, 9866913371, 9989953145 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

డిగ్రీ విద్యార్థులకు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం రూరల్: డిగ్రీ ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పేషెంట్ రిలేషన్స్ అసోసియేట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్టు బొల్లినేని మెడిస్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా నందిగామలోని కిట్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, కిమ్స్ రీసెర్చ్ అండ్ ఫౌండేషన్ సహకారంతో హైదరాబాద్‌లో శిక్షణ నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శిక్షణ కాలంలో ఉచిత భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. రెండు నెలల శిక్షణ పూర్తయిన వెంటనే కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలకు రాగోలు జెమ్స్ ఆస్పత్రిలోని బొల్లినేని మెడిస్కిల్స్ విభాగాన్ని (సెల్: 76809 45357, 79950 13422 నంబర్లు) సంప్రదించాలన్నారు.

వరి చేను మాయం



గుర్తుతెలియని వ్యక్తులు వరిచేను దొంగిలించిన పంట పొలాలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పంచాయతీ రేగులపాడు గ్రామ పరిసరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న సుమారు రెండెకరాల్లోని వరి పంటను గుర్తుతెలియని వ్యక్తులు కోసుకుని తీసుకెళ్లిపోయారని సాగుదారు పాలక పృథ్వీ ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. గుమ్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన మండంగి కిశోర్‌కు రేగులపాడు గ్రామ సమీపంలో ఉన్న పొలాలను ఆయన మేనల్లుడు పృథ్వీ కొన్నేళ్ల నుంచి సాగుచేస్తున్నాడు. ఎప్పటిలాగానే ఈ ఏడాది కూడా వరిపంట వేశాడు. ఈ క్రమంలో ఈనెల9న పొలానికి వెళ్లి చూశానని, మళ్లీ ఈనెల22న వెళ్లి చూసేసరికి పొలంలో కోతకు సిద్ధంగా ఉన్న వరి పైరు లేదని వాపోయాడు. రేగులపాడు గ్రామస్తులను అడగ్గా..వారికి తెలియదంటున్నారని, వేల రూపాయలు మదుపుపెట్టి సాగు చేసిన పంటను గుర్తుతెలియని వ్యక్తులు కోసుకెళ్లిపోవడంతో ఏం చేయాలో పాలుపోవడం లేదంటూ కన్నీటిపర్యంతమయ్యాడు. ఈ సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నాడు.

మహిళలపై దాడులకు పాల్పడితే కఠిన శిక్షలు



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఎం.దీపిక

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: మహిళలపై జరిగే దాడుల్లో నిందితులు కఠినమైన శిక్షలకు గురి కావాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలోని సమావేశ మందిరంలో శుక్రవారం ఆమె నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మహిళలపై జరిగే దాడుల్లో నమోదైన కేసుల్లో దర్యాప్తును క్షుణ్ణంగా చేయాలని, సాక్షులను, సాంకేతిక ఆధారాలను సేకరించాలని, దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా దర్యాప్తులో ఉన్న గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసులను ఎస్పీ సమీక్షించి, ఆయా కేసుల్లో దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేసేందుకు సంబంధిత దర్యాప్తు అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, ఎస్‌ఈబీ అదనపు ఎస్పీ ఎస్.వెంకటరావు, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, చీపురుపల్లి డీఎస్పీ ఏఎస్.చక్రవర్తి, ఏఆర్ డీఎస్పీ యానివర్స్, న్యాయ సలహాదారులు వై.పరశురాం, సీఐలు, ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ అధికారులకు ప్రశంసలు



రూరల్ ఎస్సై బి.గణేష్‌కు ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పెండింగ్‌లో ఉన్న కేసులను ఛేదించి, ఎక్కువ కేసులు డిస్పోజ్ అయ్యే విధంగా సమర్థవంతంగా పనిచేసిన పోలీస్ అధికారులను జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ ఎం.దీపిక అభినందించి, ప్రశంసాపత్రాలు, నగదు బహుమతి అందజేశారు.

ప్రశంసలు పొందిన పోలీస్ అధికారులు వీరే..

వన్‌టౌన్‌లో పెండింగ్ కేసుల్లో నాన్‌బెయిల్‌బుల్ వారెంట్‌ను ఎగ్జిక్యూట్ చేసిన వన్‌టౌన్ ఎస్సై ఆర్.గోపాలరావు, జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులను డిస్పోజ్ అయ్యేలా పనిచేసిన వన్‌టౌన్ కానిస్టేబుల్ బి.మోహనరావు, రూరల్ పరిధిలో చోరీ కేసును ఛేదించిన రూరల్ ఎస్సై బి.గణేష్, కానిస్టేబుల్స్ బి.గౌరీశంకర్, బి.రామకృష్ణ, కె.రామమోహన్, ఆస్పత్రుల్లో పెండింగ్‌లో ఉన్న సర్టిఫికెట్స్‌ను సకాలంలో తీసుకువచ్చిన డెంకాడ కానిస్టేబుల్ జి.రామరాజులను ఎస్పీ అభినందించారు. అలాగే పోక్సో కేసుల్లో నిందితులకు శిక్ష పడేలా సాక్షులను కోర్టులో హాజరుపర్చిన బొబ్బిలి హెచ్‌సీ సీహెచ్.స్వామినాయుడు, దొంగతనం కేసుల్లో చోరీ సొత్తును రికవరీ చేసిన రామభద్రపురం హెచ్‌సీ వీఎల్‌వీ.నారాయణ, దిశ యాప్‌ను ఎక్కువ డౌన్‌లోడింగ్, రిజిస్ట్రేషన్ చేయించి, అవగాహన కార్యక్రమాలు చేపట్టిన బాడంగి మహిళా కానిస్టేబుల్ బి.తులసి, పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా ట్రాఫిక్ రెగ్యులేషన్ విధుల్లో పనిచేసిన ట్రాఫిక్ ఎస్సైలు వి.లోవరాజు, కేవీవీ ప్రసాద్, హెచ్‌సీ ఏవీ రమణ, కానిస్టేబుల్స్ ఎస్.సింహాచలం, వై.అప్పారావు, వై.శంకరరావు, ఏటీఎం చోరీ కేసులో నిందితుడ్ని పట్టుకున్న సీసీఎస్ ఎస్సై బి.సాగర్ బాబు, ఏఆర్ కానిస్టేబుల్ పి.కాళిదాస్, ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసుల్లో ముందస్తు సమాచారం సేకరణలో సమర్థవంతంగా పనిచేసిన స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ షేక్ బి.జానీ ఏఆర్‌లో పీఎస్‌ఓ భాగంలో పనిచేస్తూ, ఇటీవల నిర్వహించిన ఫైరింగ్ టెస్టుల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు పొందిన హెచ్‌సీ వి.శ్రీనివాసరావు, కేవీ.రమణ, డి.రాము, బి.శంకర్, బీపీ రాజులను ఎస్పీ అభినందించి, జ్ఞాపికలు, ప్రశంసపత్రాలను అందజేశారు.

వేగవంతంగా ఓటరు జాబితా సవరణ

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా



పార్వతీపురం: వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

పార్వతీపురం: ఓటరు జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఓటరు జాబితా తయారీ ప్రక్రియపై కలెక్టర్‌లు, జాయింట్ కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటరు జాబితాలో చేర్పులు, తొలగింపులు, మార్పులకు సంబంధించి ఫారం-6, ఫారం-7, ఫారం-8 తీసుకుని పరిష్కరించడం, చనిపోయిన, శాశ్వతంగా వలస పోయిన వారి పేర్లను ఓటరు జాబితానుంచి తొలగించడం, పత్రికలలో వచ్చిన వార్తలకు స్పందనగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అలాగే 18 ఏళ్లు నిండిన వారినందరినీ ఓటర్లుగా చేర్పించడాన్ని వేగవంతం చేయాలని, పెండింగ్ దరఖాస్తులపై త్వరగా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావు, కేఆర్‌సీసీ డిప్యూటీ కలెక్టర్ కేశవనాయుడు తదితరులున్నారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు



మృతిచెందిన గౌతమ్

సాలూరు: పట్టణంలోని తోటవీధి సమీపంలో నివసిస్తున్న ఓ యువకుడి మరణంపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తోటవీధి సమీపంలో నివాసముంటున్న మండల వెంకటలక్ష్మి కుమారుడు గౌతమ్ (18) పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఒకేషనల్ కోర్సు చదువుతున్నాడు. సరిగ్గా చదువుకోవాలని తల్లి మందలించగా ,మనస్తాపానికి గురైన గౌతమ్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. మృతుడి తల్లి వెంకటలక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



మృతుడు చాణక్య

పూసపాటిరేగ: మండలంలోని సీహెచ్ అగ్రహారం సమీపంలో శుక్రవారం సాయంత్రం జాతీయరహదారి దాటుతుండగా కారు ఢీకొనడంతో శ్రీకాకుళం పట్టణంలోని ఉర్లాం గ్రామానికి చెందిన ఆరంగి చాణక్య (29) మృతి చెందాడు. సీహెచ్ అగ్రహారం సమీపంలో చాణక్య జాతీయరహదారి దాటుతుండగా శ్రీకాకుళం నుంచి విశాఖ వైపు వెళ్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతిచెందాడు. పంచనామా అనంతరం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పోలీసులు తరలించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై జి.బాలకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

జాతీయస్థాయి ఖోఖో పోటీలకు పెదవేమలి విద్యార్థి



లోకేష్

గంట్యాడ: మండలంలోని పెదవేమలి హైస్కూల్ విద్యార్థి రంధి లోకేష్ జాతీయస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికయ్యాడు. కాకినాడలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో మంచి ప్రదర్శన కనబరచడంతో జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. డిసెంబర్ 3 నుంచి 7వతేదీ వరకు మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడు.

ఖోఖోలో సిరిపురం విద్యార్థిని ప్రతిభ



సంతకవిటి: యోచనను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

సంతకవిటి: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థిని వై.యోచన ఖోఖో రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచింది. ఈ నెల 19 నుంచి 21 వరకు చిత్తూరు జిల్లా బంగారుపాలెంలో జరిగిన అండర్ 14 విభాగంలో శ్రీకాకుళం జిల్లా తరఫున ఖోఖో పోటీల్లో పాల్గొని ద్వితీయస్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటరావు శుక్రవారం తెలిపారు. ఈ మేరకు శుక్రవారం హైస్కూల్‌లో అభినందన సభ ఏర్పాటుచేసి విద్యార్థినితో పాటు, శిక్షణ ఇచ్చిన పీడీ బుజ్జి మాస్టారును ప్రశంసించి సత్కరించారు.

రాష్ట్రస్థాయిలో తైక్వాండో క్రీడాకారుల సత్తా



క్రీడాకారులతో కోచ్, తైక్వాండో క్లబ్ సభ్యులు

బొబ్బిలి: ఈనెల 18 నుంచి రెండు రోజుల పాటు తెనాలిలో జరిగిన రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో సబ్ జూనియర్, క్యాడెట్ విభాగాల్లో జి.చరిత, షణ్ముఖప్రియ, ఆదిత్య, రజత పతకాలు సాధించారు. అలాగే బి.గౌతమి,డి జాహ్నవి, శివరామకృష్ణ, కాంస్య పతకాలు సాధించారు. వారిని కోచ్ బంకురు ప్రసాద్, క్లబ్ సభ్యులు సబ్బాన శ్రీనివాసరావు, ఆనంద్‌లు అభినందించారు.

50 శాలలు దగ్ధం

- నవరవిల్లి సంతలో అగ్నిప్రమాదం



కాలిపోయిన తాటాకు శాలలు

భోగాపురం: మండలంలోని నవరవిల్లి సంతలో జరిగిన అగ్నిప్రమాదంలో సుమారు 50 తాటాకు శాలలు పూర్తిగా కాలిపోయాయి. గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు ప్రతి సోమవారం సంతలో కూరగాయలు విక్రయిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే శుక్రవారం సంతలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం ఎలా సంభవించిందో తెలియరాలేదు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వీఆర్వో రామునాయుడు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు.

హత్య కేసులో ముద్దాయికి జీవిత ఖైదు

సాలూరు: పట్టణంలోని బంగారమ్మకాలనీకి చెందిన వివాహిత సాంపి సన్యాసమ్మ హత్య కేసులో ఆమె భర్త లక్ష్మణరావుకు విజయనగరం అడిషనల్ డిస్ట్రిక్ట్ సెషన్‌జడ్జి కోర్టు కమ్ మహిళా కోర్టు జీవిత ఖైదు విధించినట్లు పట్టణ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, 2021 ఏప్రిల్‌లో సన్యాసమ్మను ఆమె భర్త లక్ష్మణరావు హత్యచేసినట్లు కేసు నమోదైందని చెప్పారు. ఈ కేసులో వాదనలు విన్న తరువాత లక్ష్మణరావును ముద్దాయిగా నిర్ధారించి జీవిత ఖైదు, రూ.5 వేల జరిమానా కోర్టు విధించిందని తెలిపారు.

యువకుడిపై పోక్సో కేసు నమోదు

సాలూరు: పట్టణానికి చెందిన ఓ యువకుడిపై పోక్సో కేసు నమోదుచేసినట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ, పట్టణానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైనట్లు ఆమె తల్లి ఈ నెల 16న ఫిర్యాదు చేయగా కేసు నమోదుచేశామని చెప్పారు. దర్యాప్తులో భాగంగా ఓ యువకుడిపై బాలిక తల్లిదండ్రులు అనుమానం వ్యక్తంచేయగా ఆ దిశగా ప్రత్యేక బృందాలతో విచారణ చేపట్టామని ఆ యువకుడిపై కిడ్నాప్, చైల్డ్ మ్యారేజ్ యాక్ట్, పోక్సో యాక్ట్ కింద కేసులు నమోదు చేశామని చెప్పారు. పట్టణ కోర్టులో నిందితుడిని హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు బొబ్బిలి సబ్‌జైలుకు రిమాండ్‌కు తరలించామన్నారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹85	₹140	₹150